


టీటీడీకి కూరగాయల వితరణ

పలమనేరు : శ్రీవారి సేవకులు కర్ణాటక రాష్ట్రం నుంచి 10 టన్నుల కూరగాయలను టీటీడీకి అందజేసినట్లు రవీంద్రారెడ్డి తెలిపారు.

విద్యుత్ బిల్లు సవరణ

సాక్షి ఎఫెక్ట్..



కార్వేటినగరం : ఎగువరాజుల కండ్రిగలో ఓ మూతపడిన ఇంటికి రూ.28,438 విద్యుత్ బిల్లు రావడంపై సాక్షి కథనానికి అధికారులు స్పందించారు. ఏఈ రామ్మూర్తి ఆ ఇంటికి వెళ్లి రూ.49గా బిల్లు సవరించి కొత్త మీటరు బిగించారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలోని క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 75,740 మంది స్వామివారిని దర్శించుకోగా 34,958 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.84 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది.

న్యూస్‌రీల్

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక


గానవి

పుంగనూరు : జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మండలంలోని చంద్రమాకులపల్లె జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న గానవి ఎంపికైంది. మంగళవారం హెచ్‌ఎం వెంకటరమణ విలేకరులతో మాట్లాడుతూ.. అన్నమయ్య జిల్లాలో జరిగిన సబ్ జూనియర్ ఫుట్‌బాల్ పోటీలలో బాలిక ఉత్తమ ప్రతిభను చాటిందని తెలిపారు. ఈ మేరకు జాతీయ స్థాయి పోటీలకు గానవిని ఎంపిక చేశారన్నారు. ఈనెల 25న ఛత్తీస్‌ఘడ్‌లోని నారాయణపూర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలలో గానవి పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు క్రీడాకారిణి గానవిని, వారి తల్లిదండ్రులను అభినందించారు.

'నులి'మేద్దాం


సూచనలిస్తున్న రాష్ట్ర ఆరోగ్యశాఖ జేడీ

ఐరాల : చిన్నపిల్లల్లో వచ్చే చాలా అనారోగ్య సమస్యలకు మూలం నులిపురుగులేనని.. ఆల్బెండజోల్ మాత్రలతో నులి పురుగులను నులిమేద్దామని రాష్ట్ర ఆరోగ్యశాఖ జేడీ, ఎన్‌డీడీ ప్రోగ్రాం నోడల్ అధికారి డాక్టర్ సునీల్‌కుమార్‌నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం కాణిపాకం ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ప్రతి విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని ఆ పాఠశాల హెచ్‌ఎం మోహన్‌కు ఆదేశించారు. 1 నుంచి 19 ఏళ్లు కలిగిన పిల్లలందరూ మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని, ఎలాంటి ప్రమాదం ఉండదని స్పష్టం చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఆగస్టులో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఏపీ మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్‌గా త్యాగరాజన్


త్యాగరాజన్

చిత్తూరు అర్బన్ : రాష్ట్ర మొదలియార్ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా సీఎస్ త్యాగరాజన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నామినేటెడ్ పదవుల భర్తీలో భాగంగా చిత్తూరు నగరానికి చెందిన సీఎంటీ త్యాగరాజన్‌ను ఈ పదవిలో నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.

గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్ : స్కూల్ గేమ్స్ సెక్రటరీగా రెండేళ్ల నియామకానికి స్కూల్ అసిస్టెంట్స్, పీఈటీలు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 20 వరకు ప్రభుత్వం గడువు పొడిగించిందని డీఈవో వరలక్ష్మి మంగళవారం పేర్కొన్నారు. 58 ఏళ్ల వయస్సు లోగా ఉన్న వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు వినియోగించుకొని గడువులోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలని వివరించారు.

డెత్ క్లెయిమ్స్ పరిష్కారానికి కృషి

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగుల ఈపీఎఫ్‌కు సంబంధించి డెత్ క్లెయిమ్ వేగంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని కడప రీజియన్ పీఎఫ్ కమిషనర్ రవితేజకుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డెత్ క్లెయిమ్స్ అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉద్యోగులు 9491138280 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


వేణుగోపాల్‌రెడ్డి (ఫైల్)

బైరెడ్డిపల్లె : కూటల వంక వద్ద మంగళవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గడ్డూరు పంచాయతీ కోట్రేపల్లెకు చెందిన వేణుగోపాల్‌రెడ్డి (58) బైరెడ్డిపల్లె నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కూటలవంక వద్ద అదుపుతప్పి గాయపడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడిన వేణుగోపాల్ రెడ్డిని స్థానికులు 108 వాహనం ద్వారా పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు.

హత్యాయత్నం కేసులో ప్రియుడు అరెస్ట్

పుంగనూరు : ప్రియురాలి గొంతు కోసిన కేసులో ప్రియుడు వెంకటేష్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ సుబ్బరాయుడు మంగళవారం తెలిపారు. పుంగనూరు పట్టణంలోని గోకుల్ సర్కిల్‌లో ఉంటున్న మహిళ గొంతు కోసిన వెంకటేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

దైవదర్శనానికి వెళుతుండగా..
మాటేసిన మృత్యువు

కావిడి ఎత్తుకొని వారంతా భక్తి భావంతో తిరుత్తణి ఆలయానికి కారులో బయలుదేరగా అనుకోని మృత్యువు దారిలోనే కాపు కాసి కాటేసింది. అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జిపై నుంచి కారు పడి ముగ్గురు విగత జీవులయ్యారు. కుటుంబ సభ్యులు ఏం జరిగిందో ఊహించే సరికి ఘోరం జరిగిపోయింది. ఈ విషాదకర ఘటనతో జీడీ నెల్లూరు మండలం గోవిందరెడ్డి పల్లె శోకసంద్రంగా మారింది.

- హైవే రోడ్డు నిర్మాణం వద్ద కారు ప్రమాదం
- ముగ్గురు మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు
- జీడీ నెల్లూరు వైఎస్సార్‌సీపీ నేత ఇంట్లో విషాదం


బ్రిడ్జి పై నుంచి పడ్డ ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు



ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందిన పద్మ, ఆసుపత్రికి తరలించేలోపు మృతి చెందిన విశ్వనాథరెడ్డి


ప్రమాద స్థలంలో తీవ్ర గాయాలైన చిట్టెమ్మ, కీర్తి

గంగాధర నెల్లూరు : తమిళనాడు రాష్ట్రంలోని తిరుత్తణి ఆలయానికి కావిడి ఎత్తుకొని దైవదర్శనానికి కారులో వెళుతుండగా మార్గమధ్యలో అనుకోని ప్రమాదం కుటుంబాన్ని కబళించింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా ముగ్గురు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామస్తుల వివరాల మేరకు గంగాధర నెల్లూరు మండలం వేపంజేరి పంచాయతీ గోవిందరెడ్డి పల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మాజీ మండల అధ్యక్షుడు సురేందర్ రెడ్డి తమ్ముడు విశ్వనాథ రెడ్డి (చిన్నబ్బ) కుటుంబ సభ్యులు మంగళవారం తమ ఇంటి నుంచి తమిళనాడు రాష్ట్రంలోని తిరుత్తణి మురుగన్ ఆలయానికి కావిడి ఎత్తుకొని కారులో బయలుదేరారు. ఈ కారులో విశ్వనాథ రెడ్డి, ఆయన భార్య రేఖ, వదిన చిట్టెమ్మ, అన్న కుమార్తె కీర్తి, అన్న మనవడు శాన్విక్ రెడ్డి , గ్రామస్తురాలు (పనిమనిషి) పద్మ, గోవిందరెడ్డి పల్లి నుంచి తిరుత్తణికి ప్రయాణిస్తుండగా పల్లిపట్టు నుంచి కొద్ది దూరంలో తమిళనాడుకు సరిహద్దులో తర్పూరు హైవే రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండగా అనుకోని ప్రమాదం జరిగింది. తమిళనాడు సరిహద్దులో కుమార రాజపేట- వెంగళరాజ కుప్పం ప్రాంతంలో అసంపూర్తిగా పూర్తిస్థాయిలో నిర్మాణం కానీ హైవే రోడ్డు లో ఉన్న బ్రిడ్జిపై నుంచి కారు కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న గ్రామస్తురాలు పద్మ(50) అక్కడికక్కడే చనిపోగా విశ్వనాథరెడ్డి(44) తీవ్ర గాయాలతో ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య రేఖ , వదిన చిట్టెమ్మ, అన్న కుమార్తె కీర్తి తీవ్ర గాయాలతో తమిళనాడు రాష్ట్రంలోని రాణిపేట సీఎంసీలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనలో విశ్వనాథరెడ్డి అన్న కుమార్తె కీర్తి కుమారుడు శాన్విక్ రెడ్డి (ఒక సంవత్సరం లోపు) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.

నకిలీ బిల్లులతో హైటెక్ మోసం

– రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొన్న వైఎస్సార్ సీపీ నేతలు



మహారాజపురం వద్ద నగరి పేరుతో చూపుతున్న నకిలీ బిల్లులు, పట్టుకున్న గ్రావెల్ టిప్పర్ వద్ద వైఎస్సార్ సీపీ నేతలు, తహసీల్దార్

విజయపురం : మండలంలోని మహారాజపురంలో నకిలీ బిల్లులతో తమిళనాడుకు తరలి వెళ్తుంటే ఆరు గ్రావెల్ టిప్పర్లను వైఎస్సార్ సీపీ నేతలు నకిలీ బిల్లులతో సహా రెడ్ హ్యాండెడ్‌గా మంగళవారం సాయంత్రం పట్టుకొన్నారు. దీంతో హైవే పేరుతో హైటెక్‌గా జరుగుతున్న మోసం బట్టబయలైంది. వారు తహసీల్దార్‌కు సమాచారం అందించగా బిల్లులు పరిశీలించిన ఆయన టిప్పర్లను పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీంతో ఏడాది కాలంగా జరుగుతున్న అవినీతి వ్యాపారం వెలుగు చూసింది. వివరాలు ఇలా..

విజయపురం మండలంలోని మహారాజపురంలోని గ్రావెల్ క్వారీలు తమిళనాడు సరిహద్దుకు ఆనుకొని ఉండటంతో అక్రమార్కుల కన్ను దానిపై పండింది. దీంతో కూటమి నేతలు అక్రమార్జనకు ఇది కల్పతరువుగా మారింది. గ్రావెల్ తమిళనాడుకు తరలిస్తూ ఒక టిప్పర్‌కే సుమారు రూ.10 నుంచి 15 వేల ఆదాయం గడిస్తున్నారు. ఇలా రోజుకు సుమారు 100 టిప్పర్లు తరలిస్తున్నారు.

తరలింపు కోసం నకిలీ బిల్లులు

టిప్పర్ల రవాణాకు ఎలాంటి ఆటంకం లేకుండా తమిళనాడు వెళ్లడానికి ఏపీ గనులు శాఖ పేరుతో నకిలీ బిల్లులు సృష్టించారు. ఆ బిల్లులతోనే గ్రావెల్ తరలిస్తున్నారు. మంగళవారం వైఎస్సార్ సీపీ నేతలు లారీలను అడ్డుకొని బిల్లులు పరిశీలిస్తే గ్రావెల్ తరలిస్తున్నది మహారాజపురంలో అయితే కౌలు పొందిన క్వారీ ప్రదేశం నగరి మండలం కాకవేడు అని చూపడం అది తిరుపతి జిల్లాలో ఉన్నట్లు చూపడంతో బిల్లులు నకిలీవని తేలిపోయింది. ఏడాది పాటుగా జరుగుతున్న అసలు దందా వెలుగుచూసింది. వాహనాలను వదిలేసి డ్రైవర్లు కూడా పరారీ కావడం అక్రమ వ్యాపారానికి అద్దం పట్టింది.

- ఈ సంఘటనపై తహసీల్దార్ కిరణ్ మాట్లాడుతూ.. గ్రావెల్ తరలించే టిప్పర్లను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. బిల్లులపై అనుమానం ఉండడంతో మైనింగ్ అధికారులకు సమాచారం అందించామన్నారు. సమగ్ర విచారణ అనంతరం చర్యలు తీసుకొంటామని తెలిపారు.

రక్త సంబంధీకులే హత్య చేశారా..?

– హత్య చేసి.. ఆపై ఉరితీశారంటున్న గ్రామస్తులు

యాదమరి : యువకుడిని హత్య చేసి.. ఆత్మహత్యగా చిత్రీకరణ చేసిన ఘటనపై పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. వ్యక్తిగత అప్పులు ఉండడంతో యువకుడిని రక్తసంబంధీకులే మట్టుపెట్టారనే అనుమానాలు పుట్టుకొస్తున్నాయి. యాదమరి మండలం బోధగుట్టపల్లి పంచాయతీ తొట్టిగాని ఇండ్లకు చెందిన విజయ్ కుమార్ (26) సోమవారం రక్తపు మరకలతో చెట్టుకు వేలాడుతూ కనిపించిన విషయం విదితమే. అయితే ఈ యువకుడి హత్య విషయంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రక్త సంబంధీకులే ఈ హత్య చేసి ఉంటారని గ్రామస్తులు, పోలీసులు భావిస్తున్నారు. రక్త సంబంధీకులకు రక్త గాయాలు ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలడంతో పోలీసులు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

వ్యక్తిగత అప్పులే బలితీశాయా?

తమిళనాడు రాష్ట్రం పరదరామిలోని ఆవుల వ్యాపారం చేస్తున్న మృతుడికి ఏడాది క్రితం పరదరామిలోని కొందరు వ్యక్తులతో పరిచయమైనట్లు తెలిసింది. వాళ్ల పరిచయంతో మృతుడు వేలూరులోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో పెట్టుబడి పెట్టాడని సమాచారం. ఆ కంపెనీలో రూ. లక్ష పెట్టుబడి పెడితే నెలనెలా రూ.10 నుంచి రూ. 12 వేలు వస్తుందని ఆశ పడినట్లు స్థానికులు చెబుతున్నారు. డబ్బులు కట్టిన తర్వాత ఆ కంపెనీ నుంచి 5 నెలల వరకు రూ. 10 వేలు మృతుడి ఖాతాలో జమ అయినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ మోజులో పడి చుట్టూ పక్కల గ్రామాల్లోని కొందరి చేత అప్పులు చేసి ఆ కంపెనీలో పెట్టుబడి పెట్టినట్లు వాదనలు వినిపిస్తున్నాయి. తీరా ఆ కంపెనీ బోర్డు తిప్పేయడంతో అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు మొదలైనట్లు చెబుతున్నారు. బంగారు ఆభరణాలు, అధిక మొత్తంలో డబ్బులు ఇవ్వాలని రక్త సంబంధీకులతో గొడవపడినట్లు సమాచారం. ఈగొడవలో రక్త సంబంధీకుల చేతిలోనే హత్యకు గురైనట్లు అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి.

మా మీద దయ చూపరా..!

- పెండింగ్‌లో 6 విడతల రీయింబర్స్‌మెంట్ బకాయిలు
- విద్యాశాఖ మంత్రికి విన్నవించినా స్పందన కరువు
- అయోమయంలో ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు
- నేడు తాడేపల్లిలో ఏపీ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన

తిరుపతి సిటీ: కూటమి ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ రెండేళ్ల బకాయిలు చెల్లించకపోవడంతో అటు విద్యార్థులు, ఇటు డిగ్రీ ప్రైవేటు కళాశాలలు దారుణ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ఈ ఏడాది డిగ్రీ అడ్మిషన్లు ఇప్పటి వరకు జరగకపోవడంతో పాటు 2023 నుంచి 2025 వరకు ప్రభుత్వం నుంచి సుమారు ఆరు విడతల బకాయిలు అందకపోవడంతో కళాశాలలను ఎలా కొనసాగించాలో అర్థం కాని పరిస్థితిలో యాజమాన్యాలు తలపట్టుకుంటున్నాయి. ఏడాది నుంచి పలుమార్లు విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను కలిసి విన్నవించినా స్పందన లేదు. దీంతో ఏపీ ప్రైవేటు డిగ్రీ కాలేజ్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (ఏపీపీడీసీఎంఏ) ఆధ్వర్యంలో తాడేపల్లిలోని సోషల్ వెల్ఫేర్ కార్యాలయం వద్ద బుధవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు శాంతియుతంగా ధర్నా నిర్వహించి తమ సమస్యలను ప్రభుత్వానికి విన్నవించాలని సిద్ధమయ్యారు.

6 విడతల బకాయిలు సుమారు రూ.330.15 కోట్లు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని సుమారు 108 ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉండగా అందులో 85 కళాశాలలు ఎక్కువ మంది విద్యార్థులతో కొనసాగుతున్నాయి. గత మూడేళ్లగా 6 విడతల ఫీజురీయింబర్స్‌మెంట్ సుమారు రూ.330.15 కోట్లు ప్రభుత్వం బకాయిలు పెట్టింది.

ఉమ్మడి జిల్లా సమాచారం

ప్రైవేటు డిగ్రీ కళాశాలలు	108
చదువుతున్న విద్యార్థుల సంఖ్య	47,360
పెండింగ్‌లో ఉన్నది	6 విడతలు
బకాయిలు మొత్తం	రూ.330.15 కోట్లు
ఒక్కో డిగ్రీ కళాశాలకు సుమారు	రూ.3.05 కోట్లు
ఒక్కో విద్యార్థికి సరాసరి అందాల్సిన మొత్తం	రూ.18,000

ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాం



ఆరువిడతల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఆర్థిక ఇబ్బందులతో కూరుకుపోయాం. కనీసం నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో ఉద్యోగులకు, అధ్యాపకులు జీతాలు ఇవ్వలేని దుస్థితి. కళాశాల నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడయ్యాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణం బకాయిలను విడుదల చేయాలి. – పట్నం సురేంద్రరెడ్డి, ప్రైవేటు డిగ్రీ కాలేజీస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

తక్షణం విడుదల చేయాలి

పెండింగ్ రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలి. గత 6 విడతలకు సంబంధించి సుమారు జిల్లాకు రూ.330 కోట్లు రావాల్సి ఉంది. ఇంటర్మీడియట్ ఫలితాలు వచ్చి నాలుగు మాసాలు గడుస్తున్నా ఇప్పటి వరకు డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ రాకపోవడం విచారకరం. ఈ ఏడాది కళాశాలలో కనీసం 50 శాతం అడ్మిషన్లు జరుగుతాయనే నమ్మకం లేదు. సింగిల్, డబుల్ మేజర్ అంటూ డిగ్రీ అడ్మిషన్ల విషయంలో అయోమయం నెలకొంది. – ప్రైవేటు డిగ్రీ కళాశాల యాజమాన్యాలు, తిరుపతి జిల్లా

ఆధార్ కేంద్రాల్లో ఇబ్బంది పెట్టొద్దు



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు, పాల్గొన్న డిజిటల్ సహాయకులు

చిత్తూరు కార్పొరేషన్ : సచివాలయంలో పనిచేస్తున్న డిజిటల్ సహాయకులు బాధ్యతగా పనిచేయాలని జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు తెలిపారు. మంగళవారం జెడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలోని సచివాలయ డిజిటల్ సహాయకులకు ఆధార్ నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆధార్ కోసం రద్దీ వచ్చినప్పుడు వారితో మర్యాదగా నడుచుకోవాలన్నారు. పదేపదే కార్యాలయాలకు తిప్పించుకోకుండా అప్పటికప్పుడు పనులు చేసి పంపాలన్నారు. ప్రస్తుతం అధికంగా సచివాలయాల్లో యువత పనిచేస్తున్నారన్నారు. కొందరు ప్రతి చిన్న విషయానికి ప్రజలను విసుక్కుంటున్నారని తెలుస్తోందన్నారు. ఏదో సమస్యల పై కార్యాలయానికి వచ్చేవారితో అమర్యాదగా నడుచుకోవద్దన్నారు. అనంతరం డీఎల్‌డీఓలు రవికుమార్, ఇందిరా మాట్లాడారు. ఇటీవల బదిలీలపై ఉద్యోగులు మారడంతో వారి కోసం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కొత్త ఆధార్ నమోదు, బయోమెట్రిక్, పుట్టినరోజు ,పేరు మార్పు వంటి సేవల పై మరింత అవగాహన తెచ్చుకోవాలన్నారు.

ఓర్వలేకనే ఎంపీపై అక్రమ కేసులు


నందీశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు

వెదురుకుప్పం : మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని టార్గెట్ చేస్తూ ఎలాగైనా అణిచివేయాలనే కుట్రతో ఎంపీ మిథున్‌రెడ్డిని అన్యాయంగా అరెస్టు చేసినట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేట ధనంజయరెడ్డి అన్నారు. ఎంపీ కడిగిన ఆణిముత్యంలా బయటకు రావాలని కోరుతూ మంగళవారం చవటగుంటలోని ఆవుదేవర నందీశ్వర స్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి భీమశంకర్‌రెడ్డి, వైద్యవిభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కోలార్ ప్రకాష్, మాజీ ఎంపీపీ మేలిపాటి పురుషోత్తం, సోషల్ మీడియా విభాగం మండల అధ్యక్షుడు దేవరాజులురెడ్డి, మండల యువత మాజీ అధ్యక్షుడు నరేష్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ డైరెక్టర్లు మునికృష్ణారెడ్డి, జయప్రకాష్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ గోవిందరెడ్డి, మాజీ ఎంపీటీసీ మునిరత్నంరెడ్డి, సర్పంచ్ ఆశీర్వాదం, మాజీ సర్పంచ్‌లు చిరంజీవిరెడ్డి, రమేష్ రెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి విడుదల కావాలని పూజలు

సదుం : అక్రమ కేసులతో పెద్దిరెడ్డి కుటుంబాన్ని భయపెట్టలేరని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి తెలిపారు. మండలంలోని రెడ్డివారిపల్లె శ్యాంమతుల ఎల్లమ్మ ఆలయంలో అక్రమ కేసులో అరెస్టు అయిన ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి విడుదల కావాలని సర్పంచ్ హనుమంత రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేసి ఆలయ ఆవరణలో 101 టెంకాయలను కొట్టారు. ఈ కేసులో ఎంపీ కడిగిన ముత్యంలా బయటకు వస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, కృష్ణారెడ్డి, గిరిధర్ రెడ్డి, నారాయణ రెడ్డి, ఆనంద రెడ్డి, శ్రీనివాసులు, వెంకటస్వామి, శివ, మోహన్ రెడ్డి, వెంకటరమణారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, రమణారెడ్డి, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

మెడలో చైను, తాళిబొట్టు అపహరణ

పుంగనూరు : ఇంటిలోకి వెళ్లి మహిళ మెడలో చైనులాక్కెళ్లిన సంఘటన మంగళవారం సాయంత్రం సాయినగర్‌లో జరిగింది. మోహన్ రెడ్డి, సుశీలమ్మ దంపతులు సాయినగర్‌లో నివాసం ఉంటున్నారు. సాయంత్రం 6 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి నేరుగా ఇంటిలోకి దూరి మీ ఆయన ఏం చేశాడో తెలుసా అంటూ మాట్లాడుతూ.. తలుపులకు గొళ్లెం పెట్టి మెడలోని చైను, తాళిబొట్టు లాక్కెళ్లాడని పోలీసుల ఫిర్యాదులో పేర్కొంది. సుమారు 35 గ్రాముల బంగారు చైను దొంగతనం కావడంతో ఆమె లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గంగవరంలో 32 గ్రాముల గొలుసు..

గంగవరం : మండల పరిధిలోని సాయిప్యాలెస్ హోటల్ వెనుక నివాసం ఉంటున్న శ్రావణి ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో గుర్తు తెలియని దుండగుడు ఇంట్లోకి చొరబడి శ్రావణి మెడలోని దాదాపు 32 గ్రాముల బంగారు గొలుసును దుండగుడు లాక్కెళ్లాడు. జరిగిన ఘటనపై బాధితురాలి కుటుంబ సభ్యులు గంగవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గజరాజులను కాపాడుకుందాం


ఏనుగుకు ఆహారాన్ని అందిస్తున్న సబ్ డీఎఫ్ఓ వేణుగోపాల్

పలమనేరు : కౌండిన్య అభయారణ్యంలో ఏనుగులు ఉండడం మన అదృష్టమని వాటిని మన సంపదగా భావించి వాటిని కాపాడుకుందామని పలమనేరు సబ్ డీఎఫ్ఓ వేణుగోపాల్ సూచించారు. మండలంలోని మొసలిమడుగు కుంకీ ఏనుగుల క్యాంప్‌లో మంగళవారం ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని స్థానిక అటవీశాఖ ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా ఏనుగులను అలంకరించి వాటికి పూజలు చేసి పండ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విడత థీమ్‌గా మాతృస్వాములు వాటి జ్ఞాపకాలుగా నిర్ణయించారన్నారు. గుంపులోని పెద్ద ఆడ ఏనుగు ఓ పెద్దమ్మలా గుంపును రక్షించుకుంటూ నడిపించడం చేస్తూ వాటి ఉనికికి మార్గాన్ని చూపుతుందన్నారు. ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలోని ఏనుగులు అడవిని దాటి కరెంట్ బారీన పడి మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. గ్రామాల్లోకి ఏనుగులు వచ్చినప్పుడు ప్రజలు వాటిపై దాడులు చేయడం లాంటివి చేయరాదని సూచించారు. ఏనుగులను కాపాడుకునేందుకు అందరం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ఎఫ్ఆర్వో నారాయణ, పలువురు ఎఫ్ఎస్వోలు, ఎఫ్‌బీవోలు, మావటీలు, సిబ్బంది, పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా సంకటహర చతుర్థి

– పోటెత్తిన భక్తులు


సంకటహర చతుర్థివ్రతంలో భక్తులు

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానంలో మంగళవారం సంకటహర చతుర్థి గణపతి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. చతుర్థి సందర్భంగా ఉదయం ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలకు సుగంధ పుష్పాలతో అలంకరణ చేసి...ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ అధికారులు ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆస్థాన మండపంలో కొలువుదీర్చారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి గణపతి వ్రతను చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వ్రతంను ఆచరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీమోహన్, ఈఓ పెంచల కిషోర్, డీఎస్పీ సాయినాథ్, ఏఈవో రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

నేత్రానందం.. స్వర్ణరథం

కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి రాత్రి ఆలయ మాడ వీధులలో స్వర్ణ రథ సేవను నేత్రానందంగా నిర్వహించారు.